రూ.50వేలు కొట్టు.. ఇల్లు పట్టు

- 'ఇందిరమ్మ ఇండ్లు' 'రాజీవ్ యువవికాసం'లో దందాలు
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సంచలన ఆరోపణలు

తిమ్మాపూర్, మే 24: మానకొండూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల దందా జోరుగా నడుస్తున్నదని, రూ.50వేలు కొట్టు.. ఇల్లు పట్టు.. అని లబ్ధిదారులకు ఆఫర్ ఇస్తున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సంచలన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు తెలిసే ఇదంతా జరుగుతున్నదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి శనివారం తిమ్మాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో రసమయి మాట్లాడారు. మానకొండూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరగడం లేదని చెప్పారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, స్థానిక కాంగ్రెస్ లీడర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తూ తమకు నచ్చినవారికి ఇండ్లు ఇచ్చుకుంటూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.50వేలు ఇస్తేనే లిస్టులో పేరు వస్తుందంటూ బహిరంగంగా దందా చేస్తున్నారని విమర్శించారు. రూ.50వేలలో వారికి సగం, పైకి సగం వెళ్తాయని ఓ కాంగ్రెస్ లీడర్ చెప్పాడని తెలిపారు. ఓ మండలానికి చెందిన విలేకరికి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఎంపిక కాగా ఆయన నుంచి సైతం రూ.50వేలు వసూలు చేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 42వేల మంది ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేసుకోగా 3,500మందికే ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే చెబుతున్నారని.. మిగిలిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మానకొండూర్ మండలం నిజాయితీగూడెంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రెండు, మూడు ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోసి వెళ్తుంటే.. మిగతా లబ్ధిదారులు తమ పరిస్థితేంటని నిలదీయగా, తమ నాయకులు చూసుకుంటారనడంతో అక్కడున్న వారంతా అవాక్కయ్యారని చెప్పారు. లబ్ధిదారులు తన వద్దకు వచ్చి రూ.50వేలు ఎక్కడి నుంచి తెస్తామని గోడు వెల్లబోసుకుంటున్నారని తెలిపారు. రాజీవ్ యువవికాసం కాంగ్రెస్ కార్యకర్తలకు చేయూత ఇచ్చేందుకు పెట్టారని ఎద్దేవాచేశారు. ఇందులో కూడా కమీషన్లు ఇచ్చేవారినే సెలెక్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. తన దగ్గర అన్ని సాక్ష్యాలున్నాయని పేర్కొన్నారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారని.. వెంటనే తడిసిన ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని పాతర్లపాడులో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలపై మంత్రి పొంగులేటిని నిలదీస్తున్న గ్రామస్తులు

మంత్రి పొంగులేటికి నిరసన సెగ

- ఇందిరమ్మ ఇండ్ల అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్

తిరుమలాయపాలెం, మే 24 : ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో శనివారం పర్యటిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నిరసన సెగ తగిలింది. పాతర్లపాడులో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో జరిగిన అవకతవకలపై గ్రామస్థులు పొంగులేటిని నిలదీశారు. ధనవంతులు, అనర్హులకే ఇందిరమ్మ కమిటీ వారు ఇళ్లు మంజూరు చేయించారని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రి స్పందిస్తూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరపాలని తహసీల్దార్ విల్సన్‌ను ఆదేశించారు. రెండో విడతలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

పేదలకు భారంగా ఇందిరమ్మ ఇండ్లు

- సిమెంట్, స్టీల్‌పై రాయితీ ప్రకటనలకే పరిమితం
- ఇసుక ఉచితంగా ఇచ్చినా తప్పని రవాణా చార్జీ మోత
- ఒక్కో లబ్ధిదారుపై దాదాపు రూ.3 లక్షల అదనపు భారం
- అయినా 600 ఎస్ఎఫ్‌టీతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి



హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్లు వాటి లబ్ధిదారులకు భారంగా మారాయి. రాయితీ ధరలకు స్టీల్, సిమెంట్ ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పిన మాట ప్రకటనకే పరిమితమైంది. ఇంతవరకు అది అమలుకు నోచుకోలేదు. ఇసుకను ఉచితంగా ఇస్తున్నప్పటికీ రవాణా చార్జీలు తడిసి మోపెడవుతున్నాయి. మంజూరు పత్రాలు వచ్చాక లబ్ధిదారులు సొంతగా రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తేగాని మొదటి బిల్లు వచ్చే పరిస్థితి లేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల పట్ల విముఖత చూపుతున్నారు. ఇసుక, ఇటుక, సిమెంటు, స్టీల్ తదితర నిర్మాణ సామాగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో ఎంత తక్కువ వ్యయంతో ఇల్లు నిర్మించాలన్నా ప్రతి చదరపు అడుగుకు కనీసం రూ.1,200 నుంచి రూ.1,400 వరకు ఖర్చు అవుతున్నది. ఈ లెక్కన 600 చదరపు అడుగుల ఇంటికి దాదాపు రూ.7-8 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తున్నది. ప్రభుత్వం మాత్రం ఒక్కో ఇంటికి నాలుగు విడతల్లో మొత్తం రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించింది. దీంతో లబ్ధిదారులు తొలుత తమ సొంత సొమ్ము ఖర్చు చేస్తేగానీ బిల్లులు మంజూరయ్యే పరిస్థితి లేదు. రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చుచేసి, పునాది వరకు నిర్మించుకుంటే ఆ తర్వాత మొదటి బిల్లు మంజూరవుతుంది. కానీ, లబ్ధిదారులంతా నిరుపేదలు కావడంతో ఒకేసారి ఆ మొత్తాన్ని భరించే పరిస్థితి లేదు. ఐకేపీ కింద రూ.లక్ష వరకు అప్పు ఇప్పిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ రుణాలు చాలామందికి మంజూరు కావడం లేదు. స్టీలు, సిమెంటు రాయితీపై ఇప్పిస్తామన్న ప్రభుత్వ ప్రకటన ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. ఇసుకను ఉచితంగానే ఇస్తున్నప్పటికీ రవాణా కోసం లబ్ధిదారులు ప్రతి టన్నుకు రూ.800 నుంచి రూ.1,000 వరకు చెల్లించాల్సి వస్తున్నది.

ప్రభుత్వ షరతులతో అవస్థలు

రాష్ట్రవ్యాప్తంగా మండలానికో గ్రామం చొప్పున ప్రభుత్వం 583 గ్రామాల్లో 70,322 ఇండ్లను మంజూరు చేసింది. ఇల్లు మంజూరైన 45 రోజుల్లోగా నిర్మాణ సామాగ్రి సమకూర్చుకోవాలని, 90 రోజుల్లోగా ఇంటి నిర్మాణం పూర్తిచేయాలని షరతులు విధించింది. రెక్కల కష్టంపై జీవించే నిరుపేద లబ్ధిదారులు ఒకేసారి రూ.2 లక్షలు సమకూర్చుకోలేక సతమతమవుతున్నారు. చేతిలో సరిపడా డబ్బులేక, అప్పు ఇచ్చే నాథుడు లేక, ఎలా ముందుకుసాగాలో అర్థంగాక చాలామంది లబ్ధిదారులు ఇండ్ల మంజూరు పత్రాలను పక్కన పడేశారు. ఇప్పటివరకు దాదాపు 18 వేల మంది లబ్ధిదారులు మాత్రమే ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించడం, వారిలో కేవలం 6 వేల మందే పునాదుల వరకు నిర్మాణాలను పూర్తి చేయడం ఇందుకు నిదర్శనం. దీన్నిబట్టే ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరు ఏవిధంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

600 ఎస్ఎఫ్‌టీ సరిపోదంటున్న లబ్ధిదారులు

ఇందిరమ్మ ఇంటి వైశాల్యం 600 చదరపు అడుగులకు మించరాదని, లేకుంటే ఇల్లు రద్దు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధన కూడా చాలామంది లబ్ధిదారులకు ప్రతిబంధకంగా మారింది. ప్రభుత్వ నిబంధన ప్రకారం 70 గజాల్లోపు స్థలంలోనే ఇంటి నిర్మాణం చేపట్టాలి. కానీ, చాలా మందికి అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో స్థలాలు ఉన్నాయి. కుటుంబసభ్యుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతో 600 చదరపు అడుగుల ఇల్లు తమకు సరిపోదని, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతించాలని వారు కోరుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కేంద్ర ప్రభుత్వ పీఎంఏవైతో అనుసంధానం చేయడం, గరిష్ఠంగా 600 చదరపు అడుగుల్లోనే ఇల్లు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నది.

ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరు

- ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఇస్తున్నది రూ.5 లక్షలు
- లబ్ధిదారుకు అవుతున్న ఖర్చు రూ.7.5-8 లక్షలు
- మొదటి బిల్లు మంజూరయ్యేలోగా (పునాది వరకు నిర్మాణం) లబ్ధిదారు చేయాల్సిన ఖర్చు రూ.1.5-2 లక్షలు
- ఇప్పటివరకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్లు 70,322
- అనుమతులు మంజూరైన ఇండ్లు 47,235
- నిర్మాణం చేపట్టిన ఇండ్లు 18,000
- పునాదుల వరకు నిర్మాణం పూర్తయిన ఇండ్లు 6,000

ప్రయాణమూ వ్యక్తిగత స్వేచ్ఛే

- కొణతం దిలీప్‌కు హైకోర్టు ఊరట
- అమెరికా వెళ్లేందుకు అనుమతి

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ప్రయాణం చేయడం కూడా వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమేనని హైకోర్టు తేల్చిచెప్పింది. కేసులున్నాయన్న కారణంతో నిందితుల ప్రయాణాన్ని అడ్డుకోవడం సరికాదని, నేరం రుజువయ్యే దాకా రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను నిరాకరించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. కేసులున్నాయన్న కారణంతో తనపై పోలీసులు లుకౌట్ సర్క్యులర్ జారీచేయడం చెల్లదని పేర్కొంటూ తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఉత్తర్వుల జారీకి సింగిల్ జడ్జి నిరాకరించారు. దీన్ని సవాలు చేస్తూ దిలీప్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. దిలీప్ తరపున సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి వాదన వినిపిస్తూ.. పిటిషనర్ తన తండ్రి వర్ధంతి సందర్భంగా ఓ పుస్తకావిష్కరణలో పాల్గొనేందుకు అమెరికా వెళ్లాల్సి ఉన్నదని తెలిపారు. అనంతరం ప్రభుత్వ న్యాయవాది ప్రతివాదన చేస్తూ.. పిటిషనర్‌పై 10 క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఆయన అప్పీ లు విచారణార్హం కాదని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ తనపై ఉన్న కేసులను కొట్టేయాలని కోరడం లేదని, ప్రయాణానికి సంబంధించి తన హక్కులపై కోర్టును ఆశ్రయించారని గుర్తుచేసింది. నేరం రుజువయ్యే దాకా నిందితుడికి రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను నిరాకరించరాదని సుప్రీంకోర్టు సైతం పలు సందర్భాల్లో స్పష్టం చేసిందని పేర్కొంటూ.. ప్రయాణం కూడా వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమేనని, కేసుల పేరుతో ఆ హక్కు ను అడ్డుకోవడానికి వీల్లేదని తెలిపింది. దిలీప్ అమెరికా వెళ్లేందుకు వీలుగా లుకౌట్ సర్క్యులర్‌ను జూన్ 11 వరకు సస్పెండ్ చేస్తున్నట్టు వెల్లడించింది. అనంతరం ఆయన ప్రయాణానికి షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. నిర్దేశిత షరతులన్నీ అమలు చేస్తానంటూ అఫిడవిట్ సమర్పించాలని దిలీప్‌ను ఆదేశించింది. అమెరికా నుంచి తిరిగొచ్చిన ఎంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని దిలీప్‌కు స్పష్టం చేస్తూ.. ఆయన అప్పీల్‌పై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.

కొవిడ్‌పై ఆందోళన వద్దు

- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): కొవిడ్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజలకు సూచించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో కరోనా వైరస్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. జలుబు, దగ్గులాగే కొవిడ్ కూడా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దగ్గు, జలుబు ఉన్నప్పుడు మాస్కు ధరించడం వల్ల వైరస్‌లు వ్యాపించకుండా ఉంటాయని తెలిపారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై పంచాయతీరాజ్, మున్సిపల్, ఇతర శాఖలతో కలిసి పనిచేయాలని అధికారులకు చెప్పారు. అన్ని హాస్పిటళ్లలో ఔషధాలు, ఇతర రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొవిడ్, డెంగీ పేరిట ప్రజలను ఆందోళనకు గురిచేసి, దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అటవీ ప్రాంతాలు అభివృద్ధి కావొద్దా..?

- సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క ఆవేదన

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): 'మా అటవీ ప్రాంతాలు అభివృద్ధి కావద్దా? సరైన రోడ్లు లేక మేము చీకట్లోనే మగ్గిపోవాలా?' అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తంచేశారు. అటవీ, ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి జరగనీయకపోతే అంతరాలు పెరిగి, ఆదివాసీలు ఆదిమ మానవులుగానే మిగిలిపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం సచివాలయంలో ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మౌలిక వస్తువుల కల్పన, పనులకు అటవీశాఖ అనుమతులపై ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించేందుకు అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. అటవీశాఖ కఠిన నిబంధనలతో ఉమ్మడి అదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో అటవీ సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో స్కైవేలు, హైవేలు, ఆరు వరుసల రోడ్లు వస్తున్నాయని, ములుగు వంటి ప్రాంతాల్లో సింగిల్ రోడ్డు కూడా రావడం లేదని వాపోయారు. రోడ్లు లేకపోతే తమ ప్రాంతాలు ఎలా అభివృద్ధి సాధిస్తాయని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే ఇక్కడా అవే నిబంధనలను అమలు చేయాలని కోరారు.

ఒకేసారి మూడునెలల రేషన్ బియ్యం

- జూన్‌లో పంపిణీ చేయాలని సివిల్ సప్లై ఉత్తర్వులు

హైదరాబాద్, మే 24(నమస్తే తెలంగాణ): ఒకేసారి మూడునెలల రేషన్ పంపిణీ చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ఈ మేరకు జూన్ నెల కోటాతోపాటే, జూలై, ఆగస్టు నెల బియ్యం కూడా ఇవ్వనున్నది. ఇందుకు సంబంధించి శనివారం మూడునెలల కోటా బియ్యం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్1 నుంచి 30వరకు లబ్ధిదారులకు మూడునెలల బియ్యం పంపిణీ పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది. అవసరమైన బియ్యం గోదాముల్లో అందుబాటులో ఉన్నాయని, లిఫ్ట్ చేసుకోవాలని సూచించింది.

త్వరలో గిగ్ వర్కర్ల చట్టం

- ఆర్డినెన్స్ జారీచేసే అవకాశం

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): గిగ్ వర్కర్ల సంక్షేమానికి సంబంధించిన బిల్లుకు తుది రూపమిచ్చేందుకు కార్మిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్-2025 ముసాయిదాపై వాటాదారులనుంచి సూచనలు, సలహాలు తీసుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు పూర్తికావడంతో ప్రజల నుంచి వచ్చిన సూచనలను క్రోడీకరించి బిల్లుకు తుది రూపం ఇచ్చే ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు. ఒకటి రెండు రోజుల్లో ఈ బిల్లును సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని, ఆ వెంటనే ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు తెలిపాయి.

ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఈబీసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి వినతి

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంతోపాటు, జాతీయ స్థాయిలో ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు, అగ్రకులాల నిరుపేద సంఘాల జేఏసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈబీసీ అభివృద్ధికి మంత్రిత్వశాఖ, ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను అగ్రవర్ణకులాల పేదలకు వర్తింపజేయాలని కోరారు. కిషన్‌రెడ్డి ఈ అంశంపై సానుకూలంగా స్పందించారని, ప్రధాని మోదీ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు.

మెట్రో రెండోదశకు అనుమతివ్వండి

- ఆ ప్రాజెక్టుకు కేంద్రం వాటా విడుదల చేయండి
- ఆర్ఆర్ఆర్‌కు 50% ఆర్థిక సాయం చేయండి
- రక్షణరంగ ప్రాజెక్టులకు మద్దతునివ్వండి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి వినతులు
- మోదీ స్ఫూర్తితోనే తెలంగాణ విజన్ డాక్యుమెంట్
- నీతిఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి వెల్లడి

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, ఆర్థిక చేయూతనివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తిచేశారు. హైదరాబాద్‌లో మెట్రోరైల్ ఫేజ్-2కు అనుమతులు, కేంద్ర ప్రభుత్వ వాటా నిధులు, రీజినల్ రింగ్‌రోడ్డుకు అవసరమైన నిధులు, కేంద్ర క్యాబినెట్ ఆమోదంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో శనివారం జరిగిన నీతిఆయోగ్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, అనంతరం ప్రధాని మోదీని ప్రత్యేకంగా కలుసుకున్నారు. హైదరాబాద్ నగరంలోని అన్ని ప్రాంతాలకు మెట్రో రైలు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా ఫేజ్-2 ప్రతిపాదనలు పంపామని, కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ వ్యక్తం చేసిన అనుమానాలను కూడా నివృత్తి చేశామని, దీని మీద కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వ వాటా కింద రూ.4,230 కోట్లు ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. ప్రాంతీయ రింగ్ రోడ్డుకు 2022లో ఉత్తర భాగంలో భూసేకరణ ప్రారంభమైందని, ఇందులో 50 శాతం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నదని తెలిపారు. ఎన్‌హెచ్ఏఐ టెండర్లు కూడా పిలిచిందని, ఈ భాగానికి అవసరమైన ఆర్థిక సహాయకంతోపాటు, క్యాబినెట్ ఆమోదం తెలపాలని విజ్ఞప్తిచేశారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ, ప్రభుత్వ -ప్రైవేటు సంయుక్త భాగస్వామ్యంలో, ఎంఎస్ఎంఈల్లో ఉన్నరక్షణరంగ ప్రాజెక్టులకు మద్దతివ్వాలని ముఖ్యమంత్రి ప్రధానిని కోరారు. అనంతరం కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామిని కలిసిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి మరో 800 ఎలక్ట్రికల్ బస్సులు కేటాయించాలని కోరారు. అంతకుముందు నీతిఆయోగ్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి 2047 నాటికి భారత దేశాన్ని సూపర్ పవర్‌గా నిలబెట్టాలన్న మోదీ సంకల్పాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్టు సీఎం తెలిపారు. దేశవ్యాప్త కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు, కులగణనలో తెలంగాణ అనుభవాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు.

మహిళా కాంగ్రెస్‌లో చీలిక!

- రెండు వర్గాలుగా మహిళా నేతలు
- గాంధీభవన్‌లో ఇరువర్గల నేతలు పోటాపోటీ ధర్నా, ఉద్రిక్తతలు
- సునీతారావుకు పార్టీ అధిష్ఠానం నుంచి షోకాజ్ నోటీసులు జారీ
- నోటీసులపై మండిపడుతున్న సునీతారావు వర్గం నేతలు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోయినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు తన వర్గం ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కనుసన్నల్లో మరో కొత్తవర్గం ఏర్పడ్డట్టు ప్రచారం జరుగుతున్నది. ఆయన తన సొంత బంధువర్గం మహిళలకే పదవులు ఇస్తూ.. కొత్త మహిళా వర్గాన్ని ఏర్పాటు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. గత వారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ నేతలు చేసిన ధర్నాలు, ప్రతిధర్నాలతో వ్యవహారం రచ్చకెక్కిన సంగతి తెలిసిందే.

సునీతారావు హఠావో!

ఆ మరుసటి రోజు సునీతారావుకు వ్యతిరేకంగా గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మహిళలు కొందరు నినాదాలు చేయడం ఆసక్తిగా మారింది. వారు కూడా గాంధీభవన్ మెట్లపై కూర్చొని ధర్నా చేశారు. 'సునీతారావు హఠావో.. మహిళా కాంగ్రెస్ బచావో' అంటూ నినాదాలు చేశారు. ఆమెతో పార్టీకి నష్టం జరుగుతున్నదని వారు ఆరోపించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు పార్టీ పెద్దలకు లేఖలు రాసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో సునీతారావుకు పార్టీ అధిష్ఠానం షోకాజ్ నోటీసులిచ్చింది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌పై చేసిన వ్యాఖ్యలు, గాంధీభవన్‌లో ధర్నా చేయడాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం తప్పుబట్టింది. నోటీసుపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కాంగ్రెస్ ఆదేశించింది. ఈ షోకాజ్ నోటీసులపై సునీతారావు వర్గం మండిపడుతున్నది. గాంధీభవన్‌లో రెండు వర్గాలు ధర్నాలు చేసినప్పుడు ఒక్క సునీతారావుకు మాత్రమే నోటీసులు ఇవ్వటం ఏమిటని ఆమె వర్గం నేతలు ప్రశ్నిస్తున్నారు. మహిళా కాంగ్రెస్‌లో చీలికలు తెచ్చిన నేత మీద చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నీ హద్దుల్లో నువ్వు ఉండు..

- రాఘవేందర్‌రాజుకు సీఎంవో వర్గల నుంచి స్ట్రాంగ్ వార్నింగ్?
- సివిల్ కేసులలో తలదూర్చిన పోలీసులపై కఠిన చర్యలు?
- మహబూబ్‌నగర్ భూవివాదంపై 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ అర్బన్ మండలం పాల్‌కొండ గ్రామ శివారులో సర్వే నంబర్ 272/1లో 7 ఎకరాల 30 గుంటల భూమి విషయంలో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి సోదరుల పేరు చెప్పి, మహబూబ్‌నగర్ స్థానిక ప్రజాప్రతినిధి అండ చూసుకొని రెచ్చిపోతున్న కాంగ్రెస్ నేత చలువగాలి రాఘవేందర్‌రాజుకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. శనివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'సీఎం సోదరుల పేరుతో బెదిరింపు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో శనివారం ఉదయమే సంబంధిత రిపోర్టర్ నుంచి వివరాలు తెప్పించుకున్న సీఎంవో.. రాఘవేందర్‌రాజును తీవ్రంగా మందలించినట్టు తెలిసింది. 'నీ హద్దుల్లో నువ్ ఉండు.. ప్రతి విషయంలోనూ సీఎం సోదరుల పేరు చెప్పి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. ఇకనైనా మారకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయి' అని హెచ్చరించినట్టు తెలిసింది. కాగా, ఇదే విషయమై డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి ఆ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెప్పించుకున్నట్టు సమాచారం. ఈ భూ వివాదం కేసులో పోలీసుల అండ చూసుకొనే రాఘవేందర్ రాజు రెచ్చిపోయారని స్థానిక ఎస్పీ ద్వారా ఇంటెలిజెన్స్ డీజీకి సమాచారం అందింది. ఈ క్రమంలో బాధితులను తమ వాహనంలో హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు పోలీసులే తీసుకెళ్లడం, పోలీసుస్టేషన్‌లోనే సెటిల్మెంట్లకు పాల్పడటం, నిందితుడి సమక్షంలో బాధితుడిని చంపేస్తామని బెదిరించిన ఘటనలపై పోలీసుశాఖ సీరియస్ అయినట్టు తెలిసింది. సదరు సీఐ, ఎస్ఐలపై చర్యలకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్టు సమాచారం. నిష్పక్షపాతంగా పోలీసులపై చర్యలు తీసుకుంటారా? లేక సీఎం ఇలాఖాలో అవన్నీ కామన్ అని వదిలేస్తారా? అనేది చూడాల్సి ఉన్నది. కాగా, 'ఇక నుంచి సివిల్ కేసుల్లో తలదూర్చేది లేదు' అని సదరు సీఐ స్థానిక మీడియ